క్లుప్తంగా

కేసీఆర్ హామీలను నెరవేర్చాలి



వర్ని: ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు, కేసీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు వర్ని, చందూర్, మోస్రా మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలను అందజేశారు. టీడీపీ నాయకులు విఠల్, కరాటే రమేష్, కిరణ్ కుమార్, నరేందర్ పాల్గొన్నారు.

ఈవీఎంపై అవగాహన



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో మంగళవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను వాడే విధానంపై బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటింగ్ మిషన్ ఎలా పనిచేస్తుంది, ఓటు వేయగానే ఏ విధమైన సంకేతం చూపుతుంది అనే అంశాలను వారు ప్రజలకు ప్రత్యక్షంగా వివరించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



రెంజల్(బోధన్): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణీ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం మండల సెక్టార్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రమీలారాణీ మాట్లాడుతూ.. పోషకాహారం, పిల్లల బరువులు, ఆంగ్ల మాధ్యమం బోధనపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భవతుల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకునాలన్నారు.

ముగిసిన సైన్స్‌ఫేర్



భీమ్‌గల్: పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌ఫేర్ మంగళవారం ముగిసింది ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల అధ్యక్షుడు బసంత్ రెడ్డి, కార్యదర్శి నర్సయ్య, సరస్వతి విద్యా పీఠం ఇందూర్ విభాగ్ అధ్యక్షుడు నాగరాజ్ శర్మలు బహుమతులు అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

'యజ్ఞం' ప్రారంభం



బోధన్: పట్టణంలోని ఆర్యసమాజ్ మందిరంలో ఆర్యసమాజ్, దయానంద్ గోశాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్మ ప్రచార యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వేదమంత్రోచ్ఛరణల మధ్య యజ్ఞం నిర్వహించారు. గురువారం వరకు కొనసాగనున్నాయి. నీరజామాత, ప్రదీప్‌గుప్తా ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే సతీమణి ఫాతిమా జన్మదిన వేడుకలు



నవీపేట/రెంజల్/బోధన్‌టౌన్/ఎడపల్లి: బోధన్ నియోజకవర్గంలో మంగళవారం ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా జన్మదినాన్ని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు మండలాలు, గ్రామాల్లో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి, వేడుకలు నిర్వహించారు. అలాగే రక్తదాన శిబిరాలు, పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఫాతిమా హాజరై, కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే నివాసంలో చిన్నారులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సైకిళ్లు, వికలాంగులకు స్కూటీలను ఫాతిమా పంపిణీ చేశారు.

నేడు ఈజీఎస్ ప్రజావేదిక

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో బుధవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కూలీలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పశువులకు టీకాలు

రుద్రూర్: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో మంగళవారం మండల పశువైద్యాధికారి సురేష్ కుమార్ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సర్పంచ్ గంగాధర్, సుధీర్‌గౌడ్, గోపాల మిత్రలున్నారు.

తెరుచుకోని పశువైద్యశాల

- డొంకేశ్వర్‌లో వెటర్నరీ ఆస్పత్రికి తాళం
- పక్షం రోజులుగా హాజరుకాని సిబ్బంది
- పట్టించుకోని పశువైద్య అధికారులు



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రం గతకొన్ని రోజులుగా తెరుచుకోవడం లేదు. ఇదివరకు ఇక్కడ లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఇస్మాయిల్ వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో వేరొక అధికారిని నియమించినప్పటికీ ఇంత వరకు విధుల్లో చేరలేదు. దీంతో తాళం వేసి ఉన్న ఈ కార్యాలయం గత పదిహేను రోజులుగా తెరుచుకోవడం లేదు. తద్వారా మండలంలో పశువైద్య సేవలు అందించే వారు కరువైయ్యారు. పశువులు అనారోగ్యానికి గురైతే నందిపేట్‌కు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విధుల్లో చేరని జూనియర్ వెటర్నరి ఆఫీసర్..

మోస్రా మండలంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సరళరాణిని డొంకేశ్వర్ పశువైద్య కేంద్రానికి బదిలీ చేస్తూ జిల్లా పశుసంవర్ధక శాఖ నుంచి ఉత్తర్వులు ఇచ్చారు. వాస్తవానికి ఆమెది వాస్తవిక పోస్టు కూడా డొంకేశ్వర్‌లోనే. ఇన్ని రోజులు డిప్యూటేషన్‌పై మోస్రాలో పని చేశారు. అయితే, డొంకేశ్వర్‌కు బదిలీ చేస్తూ ఆర్డర్ ఇచ్చి పది రోజులు దాటినా ఆమె విధుల్లో చేరలేదు. ఇక్కడ పని చేయడానికి ఆమె ఇష్టంగా లేనట్లు తెలుస్తోంది. విధుల్లో చేరక పోవడంతో పక్షం రోజులుగా పశువైద్య కేంద్రానికి తాళం ఉంది. మండల పశువైద్యాధికారి కూడా ఇటు వైపు వచ్చిన దాఖలాలు లేవు. డొంకేశ్వర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో పశువులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో డొంకేశ్వర్‌లో పశువైద్య కేంద్రాన్ని చాల సంవత్సరాల కిందటే ఏర్పాటు చేశారు. మండల పశువైద్యాధికారి పోస్టు ఉన్నప్పటికీ ఖాళీగానే ఉంది. నందిపేట్‌కు చెందిన అధికారే డొంకేశ్వర్‌కు ఇన్‌చార్జి అధికారిగా పని చేస్తున్నారు. ఆయన ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. అయితే, వెటర్నరీ సిబ్బందితోనే పశువైద్య కేంద్రాన్ని నెట్టుకొస్తున్నారు. అది కూడా మొన్నటి వరకు ఒక్కరే పని చేశారు. అటెండర్ పోస్టు కూడా లేకపోవడంతో ఆఫీసును తెరిచేవారు కరువైయ్యారు. పశు వైద్యులు సక్రమంగా లేకపోవడంతో పశువులకు వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని, ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదని చుట్టుపక్కల గ్రామాల్లోని పాడి రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్యశాలకు తగిన సిబ్బందిని కేటాయించి, సమస్యలు పరిష్కరించాలని పశుపెంపకందారులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం..

మొన్నటి వరకు పని చేసిన వెటర్నరీ సిబ్బంది ఒకరు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వేరొకరికి పోస్టింగ్ ఇచ్చాం. ఇప్పటి వరకు విధుల్లో చేరలేదని తెలిసింది. ఆఫీసుకు తాళం ఉంటున్న విషయం నా దృష్టికి రాలేదు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి మండలంలో పశువైద్య సేవలు సక్రమంగా అందేలా చూస్తాం. – జగన్నాథచారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, నిజామాబాద్

మహిళలకు అన్నగా అండగా ఉంటా



ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు

ఆర్మూర్/మాక్లూర్: నియోజకవర్గం పరిధిలోని ప్రతీ మహిళకు అన్నగా అండగా నిలుస్తానని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం పలువురు మహిళలు ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే దంపతులు వారికి చీరలను బహుమతిగా అందజేశారు. అలాగే ఇటీవల డ్రైవింగ్ లైసెన్సులు పొందిన వారికి లైసెన్సులను అందజేశారు. అనంతరం నియోజకవర్గం పరిధిలోని గంగారమంద, చిక్లి, గుత్ప, శాపూర్, మచ్చర్ల, మిర్దాపల్లి, ఖానాపూర్ గ్రామాలకు చెందిన వడ్డెర సంఘం మహిలు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినిత, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గత ఎన్నికల హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

రెంజల్(బోధన్): రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ డిమాండ్ చేశారు. మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో మంగళవారం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. దేశంలో కార్మిక వర్గ పోరాటాలు తీవ్రమవుతున్న దశలో మహాసభ నిర్వహించడం మంచి పరిణామమన్నారు. రైతులు, కార్మికవర్గ పోరాటాలను అణిచివేసే ధోరణి ఇంకా కొనసాగుతుందన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయగౌడ్, కిషన్, గుమ్ముల గంగాధర్, సురేష్, రాజేశ్వర్, పుట్టి నాగన్న, నసీర్, పార్వతి, రాజేశ్వర్, ఒడ్డెన్న పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్



కుకునూర్‌లో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

వేల్పూర్: మండలంలోని కుకునూర్, అమీనాపూర్ గ్రామాలలో మంగళవారం బాల్కొండ నియోజకవర్గ నాయకుడు ముత్యాల సునీల్‌కుమార్ గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ.. కాంగ్రెస్ పథకాలను ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎకరానికి రూ. 15వేల పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. నాయకులు గడ్డం నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

భీమ్‌గల్: మండలంలోని జాగీర్యాల్ గ్రామానికి చెందిన బుల్స్ యూత్ సభ్యులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చిన్నరెడ్డి, పల్లెశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

గొర్రెల పంపిణీ

మాక్లూర్: మండలంలోని బోర్గాం (కె)లో మండల పశువైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో కార్పొరేటర్ రాయ్‌సింగ్ రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలోఉమా సహేర్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం చెక్కులు..

వర్ని: మోస్రా మండల కేంద్రానికి చెందిన మైనార్టీలకు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఆర్థికసాయం చెక్కులను మంగళవారం బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఎంపీపీ పిట్ల ఉమా, శ్రీరాములు, హనుమంత్ రెడ్డి, సాయగౌడ్, గంగారెడ్డి, సర్పంచ్ సుమలత రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తులు..

వర్ని: చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో మంగళవారం పరుచూరి నరసింహారావు జ్ఞాపకార్థం నిరుపేదలకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి దుస్తులను పంపిణీ చేశారు. ప్యారం అశోక్, దాసరి గంగారాం, సాయిరెడ్డి, కృష్ణగౌడ్, బాలరాజుగౌడ్, సాయగొండ, చందర్, రాంరెడ్డి పాల్గొన్నారు.

మైనారిటీ బంధు చెక్కులు..

రుద్రూర్: మండలంలోని పలువురు లబ్ధిదారులకు మైనారిటీ బంధు చెక్కులను మంగళవారం జెడ్పీటీసీ నరోజి గంగారాం అందజేశారు. ఎంపీడీవో బాల గంగాధర్, వైస్ ఎంపీపీ సాయిలు, సంజీవరెడ్డి, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్స్..

రుద్రూర్: మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. విండో మాజీ చైర్మన్ పత్తి రాము, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నిధులు ఇవ్వండి

మాక్లూర్: హనుమాన్ మందిరం పునర్నిర్మాణానికి నిధులు ఇప్పించాలని కోరుతూ మండలంలోని మాధాపూర్ హనుమాన్ ఆలయకమిటీ సభ్యులు మంగళవారం దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అలాగే ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని సైతం కలిశారు. వారు సానుకూలంగా స్పందించినట్టు ఆలయ కమిటీ సభ్యులు గంగారెడ్డి, విఠల్‌రావు, సుశీల్‌లు తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

రుద్రూర్: కోటగిరిలోని శ్రీ వేద హైస్కూల్లో మంగళవారం బోధన్ దీక్షిత్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే స్కూల్ కరస్పాండెంట్ తెల్ల అక్షర రవికుమార్ ను ఉత్తమ వినియోగదారురాలిగా ఎంపిక చేసి సత్కరించారు. ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

బోధన్: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ, పట్టణంలో ఎన్డీఎస్ఎల్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 25వ రోజు కొనసాగాయి. కార్మికులు అన్వర్ మియా, ఎస్‌కే మోహిన్‌లు దీక్షలో కూర్చున్నారు. గంగపుత్ర సంఘం కార్యదర్శి కనకరాజు దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్మికులు, కార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నా బావుసాఠే జయంతి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని హరిజన సంఘంలో అన్న బహుసాఠే జయంతిని దళిత సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

బస్సు సమయంపై సర్వే

వర్ని: బోధన్ నుంచి హమ్నపూర్, కోటయ్య క్యాంపు, మోడల్ స్కూల్ వరకు నడిచే ఆర్టీసీ బస్సు సమయంపై బోధన్ డిపో మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం సర్వే నిర్వహించారు. విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సు గ్రామంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని డీఎం శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

షాదీఖానా నిర్మాణానికి భూమిపూజ

వర్ని: చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో షాదీఖానా నిర్మాణానికి మంగళవారం సర్పంచ్ బొడ్డోల్ల సత్యనారాయణ భూమిపూజ చేశారు. నాయకులు మైబూబ్, సలీం, హుస్సేన్, సిరాజ్, నర్సింలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లను సర్పంచ్ అశోక్, ఎంపీడీవో సంతోష్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎంపీటీసీ జ్యోతి, ఎంపీవో బాగయ్య, హెచ్ఎం శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెర్కిట్(ఆర్మూర్): వర్షకాలం ప్రారంభమైనందున ప్రతి ఒక్కరు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి సాయి సూచించారు. పెర్కిట్‌లో మంగళవారం గ్రామస్తులకు, పాఠశాలల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు రవీందర్,ఆనవాల, ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, ఎస్తేర్ రాణి, గణేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆర్మూర్‌టౌన్: ఆశ వర్కర్లకు ఉద్యోగత భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్మూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఎమ్మెల్యే పీఏ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం



బోధన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శ్రీధరాచార్యులు, ఆలయ పూజారి దీపక్ పాండేలు ,భక్తులు పాల్గొన్నారు.

■ **వైభవంగా ఓనం పండుగ**



నవీపేట: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మంగళవారం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఓనం పండుగ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు అయ్యప్ప స్వామి విగ్రహాన్ని పూలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకులు శశాంక్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, పూజలు నిర్వహించారు.

కంచె.. కొన్ని రోజులకేనా?



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్లకు ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన కంచెలు కొన్ని రోజులకే ధ్వంసమయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా ప్రమాదకరంగా ఉండటంతో ఈనెల 23న సాక్షి దిన పత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి, ట్రీగార్డ్స్‌కు వినియోగించే ప్లాస్టిక్ తీగతో రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేశారు. కానీ రెండు రోజులకే ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచె ధ్వంసమైంది. ఇనుప కంచె ఏర్పాటు చేయాల్సిన చోట ప్లాస్టిక్ తీగతో కంచె ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఇనుప కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శం



యువకులకు బీఆర్ఎస్ కండువా కప్పుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: సీఎం కేసీఆర్ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, దేశానికి తెలంగాణను ఆదర్శంగా నిలిపారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ముప్కాల్, ఏర్గట్ల మండలాలకు చెందిన పలువురు నాయకులు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే వివిధ గ్రామాలలో కుల సంఘాల నిర్మాణానికి మంజూరైన సుమారు రూ. 1కోటి 8లక్షల నిధుల మంజూరు ఉత్తర్వులను సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో వస్తున్న కాంగ్రెస్, బీజేపీలతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

ఆర్మూర్‌టౌన్: 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ వారి సహకారంతో విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కును ప్రతిఒక్కరు వినియోగించుకోవాలన్నారు. సెప్టెంబర్ 2వ, 3వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ క్రీడా జీవితంలో సాధించిన విజయాల గురించి వివరించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఎంఈవో రాజగంగారాం, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కాంత్‌రావు, ఆర్‌ఐ అశోక్‌సింగ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



నందిపేటలో మాట్లాడుతున్న అధికారులు

నందిపేట్: మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత టీం సభ్యులు పలు అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. బేటి బచావో బేటి, పడావో స్కీమ్, సుకన్య సమృద్ధి, ప్రధానమంత్రి యశస్వి యోజన, ప్రధానమంత్రి మాతృవందన యోజన, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, మిషన్ వాత్సల్య, అటల్ పెన్షన్ యోజన, ముద్ర లోన్స్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నెంబర్స్ 181 ఉమెన్ హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 100 పోలీస్‌గురించి వివరించారు. ఐసీడీఎస్ సిబ్బందిపుష్ప, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం





మగ్గిడిలో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు.. ఆర్మూర్‌లో..

పెర్కిట్)/ఆర్మూర్‌టౌన్/బాల్కొండ: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో మంగళవారం హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్మూర్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, విద్యాహైస్కూల్‌లో క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయులను, పలువురు క్రీడాకారులను సన్మానించారు. ఆర్మూర్‌లోని మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడ దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండ మండల కేంద్రంలో..

నూతన కార్యవర్గం ఎన్నిక



వర్ని: మోస్రా మండల భారతీయ జనతా పార్టీ యువమోర్చా నూతన కమిటీని మంగళవారం మండల బీజేపీ అధ్యక్షుడు స్వామిగౌడ్ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గాండ్ల సుధాకర్, ఉపాధ్యక్షులుగా వినోద్ యాదవ్, కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా బండి ప్రసాద్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బోపురం అనిల్, కార్యవర్గ సభ్యులుగా సతీష్, శివరాత్రి అశోక్ ఎన్నికయ్యారు. నాయకులు శ్రీకాంత్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ఇష్టారీతిన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు పట్టణంలో ధర్నా చేపట్టారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సమస్యపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. చర్యలు తీసుకోని మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉదయ్, నూతుల శ్రీనివాస్, బాలు, పులియుగేంధర్, విజయానంద్, కిరణ్, దోండి ప్రకాష్, పెద్దోళ్ల భరత్ పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – కోక్ (తెలుగు) – 11.00, 2.35, 6.10, 9.45
- స్క్రీన్-2 – గాండివధారి అర్జున – 10.00, 1.00, 4.00, 7.00, 10.00
- స్క్రీన్-3 – జైలర్ (తెలుగు) – 11.35, 3.00, 6.25, 9.50
- స్క్రీన్-4 – బెదురులంక-2012(తెలుగు)- 12.35,6.50,10.00
  బాయ్స్ హాస్టల్(తెలుగు)-3.45